



మాతా.. అన్నపూర్ణేశ్వరీ..

అన్నపూర్ణేశ్వరీదేవి అలంకరణలో దుర్గాదేవి

దసరా శరన్నవరాత్రి వేడుకల మూడోరోజు శనివారం లేపాక్షి ఆలయంలో దుర్గాదేవి.. అన్నపూర్ణేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గావీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు.

-లేపాక్షి

నృసింహావతారంలో శ్రీవారు



నృసింహావతారంలో దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

కదిరి పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకైంకర్యాలు, అలంకరణ అనంతరం నృసింహావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. **-కదిరి**

బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు



కదిరి, అక్టోబరు 5: అమడగూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలికలపై అదే ఊరికి చెందిన యువకుడు రాజశేఖర్ అత్యాచారానికి ఒడిగట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం విలేకరులకు వెల్లడించారు. ఏడో తరగతి చదువుతున్న బాలికపై రాజశేఖర్ ఏడాదిగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. బాలికకు కడుపు నొప్పి రావడంతో కర్ణాటకలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలిక గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. దీనిపై కర్ణాటక పోలీసులు.. అమడగూరు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు డీఎస్పీ వివరించారు.

వీఆర్వో బదిలీల్లో ముడుపుల పర్వం

- పైసలిస్తే కోరుకున్న చోటకు..
- ఇటీవలే బదిలీపై వచ్చినా మళ్లీ స్థానచలనం
- ఫెవికాల్ వీరులెందరో?
- కలెక్టరేట్‌లో చక్రం తిప్పుతున్న ఓ అధికారి?



మనీ ట్రాన్స్‌ఫర్స్!

ఓ వీఆర్వో 2008 నుంచి ముదిగుబ్బ మండలంలోనే పని చేస్తున్నాడు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆయన మాత్రం కదలడు. అలా ఆ మండలంలో ఫెవికాల్ వీరుడిగా పేరు తెచ్చుకునానడు. ఈ వీఆర్వో ఒకే మండలంలో పనిచేయడం వల్ల భారీఎత్తున అక్రమాలకు పాల్పడుతూ రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాలకపక్షం మారినా మరో ఐదేళ్లు మండలంలోనే కొనసాగేలా కలెక్టరేట్‌లో చక్రం తిప్పాడు. మళ్లీ ముదిగుబ్బ మండలంలోనే పనిచేసే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఈ తతంగం వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం.

ఇద్దరు వీఆర్వోలు ఎన్నికల ముందు బత్తలపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. ఏడాది కూడా పూర్తి కాకుండా వారిని బదిలీ చేసే అవకాశం ఉండదు. అయినా స్థానచలనం కల్పించారు. సదరు వీఆర్వోల నుంచి భారీఎత్తున ముడుపులు తీసుకుని వారు కోరుకున్న చోటికే పోస్టింగ్ ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో బదిలీల వ్యవహారంలో ముడుపుల తంతు సాగుతోందన్న విమర్శలున్నాయి. దీనంతటికీ కలెక్టరేట్‌లో పనిచేసే ఓ అధికారి కారణమన్న చర్చ సాగుతోంది. ఆయన తీరుతో రెవెన్యూ శాఖకే మచ్చ ఏర్పడుతోంది.

ధర్మవరం, అక్టోబరు 5: జిల్లాలో వీఆర్వోల బదిలీల వ్యవహారం వెనుక ముడుపుల బాగోతం సాగుతోందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కాసులు కొడితే కోరుకున్న చోటకు బదిలీ కావచ్చు. డబ్బు ఇవ్వకపోతే ఉన్నఫలంగా బదిలీ చేయడమేకాకుండా దూరప్రాంతాలకు పంపుతున్నారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇదంతా ఆ అధికారి కనుసన్నల్లోనే సాగుతోందన్న విమర్శలు వినిపిపిస్తున్నాయి. అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఆ అధికారి బదిలీల వ్యవహారంలో స్థాయిని, మండలాన్ని బట్టి ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తూ సీనియారిటీని సైతం తుంగలో తొక్కుతూ బదిలీ చేయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అధికారికి కాసులు ఇచ్చుకుంటే చాలు ఎన్నేళ్లయినా స్థాన చలనం ఉండదు. ఆ అధికారి కనుసన్నల్లోనే వారంతా ఫెవికాల్ వీరుల్లా చెలామణి అవుతున్నారు. ఎన్నికల ముందు కొందరు బదిలీపై వచ్చారు. వారు వచ్చి ఆరు నెలలు కూడా పూర్తి కాలేదు. అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ బదిలీ చేయడానికి వీలుండదు. కాసులకు అలవాటు పడిన సదరు అధికారి.. ఆ వీఆర్వోలతో లాలూచీపడి బదిలీ చేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు ఆ శాఖ వర్గాలు విమర్శిస్తున్నాయి.

పెద్దమొత్తంలో ముడుపులు

వీఆర్వోల బదిలీల విషయంలో జిల్లాలో 20కిపైగా మండలాల్లో భారీఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, కొత్తచెరువు, చిలమత్తూరు, పుట్టపర్తి, నల్లమాడ, గోరంట్ల, సోమందేపల్లి తదితర మండలాల్లో వీఆర్వోల బదిలీల విషయంలో భారీగా ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తోంది. కొందరు వీఆర్వోలు పట్టణాల్లో నివాసముంటూ బస్సు సౌకర్యం ఉన్న మండలాలకు వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న సదరు కలెక్టరేట్ అధికారి విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతూ డబ్బు ఇచ్చిన వారికే ప్రథమ ప్రాధాన్యమిస్తూ కోరిన చోటకు బదిలీ చేస్తున్నాడని తెలుస్తోంది. దీంతో నిజాయతీ వీఆర్వోలు బయటకు చెప్పుకోలేక లోలోపలే మదనపడే పరిస్థితి నెలకొంది.

వీరు కదలరు..

ఉద్యోగులకు ఐదేళ్లకు కచ్చితంగా బదిలీలు ఉంటాయి. పైస్థాయిలో పలుకుబడి ఉండటంతోపాటు వారు కోరిన మేర ఆమ్యామ్యాలు ఇచ్చుకోవడంతో వారికి మాత్రం బదిలీలు అనేవి మచ్చుకైనా కనిపించవు. ముదిగుబ్బ మండలంలో ఓ ఆర్వో 2008లో బదిలీపై వచ్చారు. ఇప్పటికీ అదే మండలంలోనే పనిచేస్తున్నారు. ఆయనకు బదిలీనే లేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా అతడు మాత్రం అక్కడే పనిచేస్తున్నాడు. మరోచోటకు బదిలీ చేయాలనే ఆలోచన కూడా చేయట్లేదు. అందుకు కారణం అతడు అందించే ముడుపులేనన్నది బహిరంగ రహస్యమే. ఇలాంటి వారు జిల్లాలో 10 మందిదాకా ఉన్నట్లు రెవెన్యూ వర్గాల ద్వారా తెలుస్తోంది.

భారీ గోల్‌మాల్

వీఆర్వోల బదిలీల విషయంలో కలెక్టరేట్‌లోని ఓ అధికారి అవినీతి కారణంగా కొందరు ఇబ్బంది పడుతున్నారు. కొందరు మాత్రం ముడుపులు ఇచ్చుకుని కోరిన చోటకు బదిలీ చేయించుకునే పరిస్థితి ఏర్పడింది. ఆ మండల పరిస్థితి దృష్ట్యా ఒక్కో వీఆర్వో నుంచి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు దండుకుని, బదిలీ చేస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. దీంతో నిజాయతీ వీఆర్వోలు ఇబ్బందులు పడుతున్నారు. వీఆర్వోల బదిలీల్లో రాజకీయ జోక్యం కొంత మేర తగ్గడంతో ఇదే అదునుగా భావించిన ఆ అధికారి అవినీతికి అంతులేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బదిలీలవ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆ శాఖకు చెందిన పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.





నేలపైపడ్డ వైరు

తెగిపడిన విద్యుత్ వైరు

తనకల్లు, అక్టోబరు 5: మండలంలోని పెద్దపల్లిలో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో విద్యుత్ వైరు తెగి కిందపడింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కాసేపటికి వైరు తెగిపడిన విషయాన్ని గ్రామస్థులు గుర్తించారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో రాత్రంతా చీకట్లోనే మగ్గారు. ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్‌వైరు తెగిపోయినట్లు ఆ శాఖవర్గాల ద్వారా తెలుస్తోంది. గ్రామంలో 20 ఏళ్ల క్రితం ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం, అది ప్రస్తుత జనాభాకు చాలక సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని ఆవేదన చెందుతున్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



సమస్య పరిష్కరిస్తాం: శ్రీకాంత్, ట్రాన్స్‌కో ఏఈ, తనకల్లు

పెద్దపల్లిలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో సమస్య తలెత్తుతోంది. రెండ్రోజుల్లోగా గ్రామంలో పర్యటించి, సమస్య పరిష్కరిస్తాం. విద్యుత్ లైన్లు మార్చే విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

టపాసుల దుకాణాలకు 210 దరఖాస్తులు

పుట్టపర్తి, అక్టోబరు 5: జిల్లావ్యాప్తంగా దీపావళి సందర్భంగా టపాసుల విక్రయానికి లైసెన్స్ కోసం 210 దరఖాస్తులు వచ్చాయని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. దరఖాస్తు ఆఖరిరోజు శనివారం జిల్లాలోని నాలుగు డివిజన్ల నుంచి కలెక్టరేట్‌కు దరఖాస్తులు చేరాయి. రెవెన్యూ, పోలీసు, ఫైర్ అధికారులు వాటిని పరిశీలించి, లైసెన్సు మంజూరు చేస్తారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, అక్టోబరు 5: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కోర్టు ఆవరణలో చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. న్యాయాధికారి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద, పనిచేసే కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలన్నారు. అప్పుడే మానవ మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పడిగాపులు కాస్తున్నాం



రేషన్ దుకాణానికి ఎప్పుడెళ్లినా తమ వద్ద పంపిణీ మొదలు కాలేదంటున్నారు. రోజుకు నాలుగుసార్లు దుకాణం వద్దకు వెళ్లి అడుగుతున్నాం. అయినా ప్రయోజనం లేదు. రోజూ పడిగాపులు కాయాల్సి వస్తోంది.

- నారాయణమ్మ, కార్డుదారు, కునుకుంట్ల



తాడిమర్రి మండలంలో రేషన్ సరుకుల పంపిణీలో తీవ్ర జాప్యమవుతోంది. లాగిన్ సమస్యగా మారింది. ఆరేడు దుకాణాలకు కలిపి ఒకే లాగిన్ ఉండడంతో ఒకరు పంపిణీ చేస్తే.. మిగతా వారంతా ఖాళీగా ఉండాలి. వారు ఆపేసేదాకా మిగతా వారికి అవకాశం రాదు. దీంతో సరుకుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. లాగిన్ సమస్య కారణంగా దుకాణాల వద్ద కార్డుదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

- తాడిమర్రి

లాగిన్.. యాగీ..!

రేషన్ పంపిణీలో తీవ్ర జాప్యం

- ఆరేడు దుకాణాలకు ఒకే లాగిన్
- ఒకరు ఆపేశాకే.. మరొకరు పంపిణీ చేసే అవకాశం
- కార్డుదారులకు తప్పని పడిగాపులు



రేషన్ షాపు వద్ద కార్డుదారుల పడిగాపులు

ఐదు రోజులు.. 4వేల కార్డులు

తాడిమర్రి మండల వ్యాప్తంగా 10,618 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు 31 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. గతంలో 7 ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేసేవారు. ఆ మేరకు ఏడు లాగిన్లు ఇచ్చారు. ఏడాది క్రితం నుంచి రెండు ఎండీయూ వాహనాలు పనిచేయట్లేదు. మరో రెండు రిపేర్ల కారణంగా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నాయి. మూడు వాహనాలు మాత్రమే పనిచేస్తున్నాయి. నారసింపల్లి, పుల్లంపల్లి, నిడిగల్లు, కునుకుంట్ల 1, 2, రామాపురం, చిల్లవారిపల్లి ఈ ఏడింటికి కలిపి ఒకే లాగిన్. ఒక్కరు రేషన్ పంపిణీ ప్రారంభిస్తే మిగిలిన ఆరుగురు ఖాళీగా ఉండాల్సిందే. ఆయన లాగవుట్ అయ్యాక మరొకరు పంపిణీ ప్రారంభించాలి. దీంతో మిగిలిన ఆరు రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రతి డీలర్‌కు లాగిన్ కేటాయిస్తే రేషన్ పంపిణీలో జాప్యానికి తావుండదని కార్డుదారులు పేర్కొంటున్నారు. 10,618 రేషన్‌కార్డుల్లో గడిచిన 5 రోజుల్లో కనీసం 4 వేల కార్డులకు కూడా సరుకులు పంపిణీ చేయలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులు అందరు రేషన్ డీలర్లకు లాగిన్ కేటాయించాలని కార్డుదారులు కోరుతున్నారు.



అందరికీ అవకాశం ఇవ్వాలి

గ్రామంలో రెండు చౌకధరల దుకాణాలున్నాయి. రెండింటి వద్ద ఒకేసారి సరుకులు పంపిణీ చేసే అవకాశం కల్పించాలి. దుకాణం వద్దకు ఎప్పుడెళ్లినా ఇంకా లాగిన్ ఇవ్వలేదు అంటున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

- కాటమయ్య, కార్డుదారు, కునుకుంట్ల



పట్టుదలతో చదవండి

డీఎస్సీ అభ్యర్థులకు మంత్రి సవిత సూచన

పెనుకొండ టౌన్, అక్టోబరు 5: పట్టుబట్టి మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ తీసుకొచ్చాననీ, అభ్యర్థులు కూడా అదే పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ప్రైవేటు కళాశాలలో మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గత ఐదేళ్లు నిరుద్యోగ యువత బతుకులతో జగన్ చెలగాటమాడారన్నారు. ఉద్యోగాలివ్వకుండా రోడ్డున పడేశారన్నారు. మెగా జాబ్ క్యాలెండర్ అంటూ మాయమాటలు చెప్పారని ధ్వజమెత్తారు. టీడీపీ ఎన్నికల హామీ మేరకు అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారన్నారు. పెనుకొండకు డీఎస్సీ కోచింగ్ సెంటర్ కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరానన్నారు. పట్టుబట్టి తేగలిగానన్నారు. పట్టుదలతో చదివి అత్యధిక ఉద్యోగాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమాధికారి నిర్మలాజ్యోతి పాల్గొన్నారు.



గొర్రెల షెడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌తో

ఉపాధి

■ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 5: జిల్లాలో మాంసం ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మండలంలోని పైపల్లిలో గొర్రెల పెంపకం యూనిట్లను కలెక్టర్ శనివారం పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గొర్రెలు, మేకలు 31 లక్షలుపైగా ఉన్నాయన్నారు. మరిన్ని గొర్రెల పెంపకం యూనిట్లు మంజూరుచేసేలా చర్యలు చేపడతామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం సాగిస్తాం

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు
- హాస్టళ్లలో పోస్టులు భర్తీ చేయాలి: గేయానంద్
- మొదలైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాలు


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 5: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగిస్తామని ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ విద్యారంగాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. బీజేపీ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ విధానం వల్ల చాలా పాఠశాలలు మూతపడి, విద్యార్థులు చదువుకు దూరమతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతోందన్నారు. దేశానికి పరిశ్రమలు తీసుకురాకపోగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం దురదృష్టకరమన్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్నా విద్యారంగం అభివృద్ధి పట్ల చర్యలు శూన్యమన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్లు, వంటమనుషులు, వాచ్‌మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్న, అశోక్, ఉపాధ్యక్షుడు ఓతూరు పరమేష్, రామ్మోహన్, వినోద్‌కుమార్, కిరణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత, అమూల్య, అనంతపురం జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఉపాధ్యక్షుడు వైటీసీ రమేష్, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.51



అనంతపురం రూరల్, అక్టోబరు5: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.51తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.27 పలికినట్లు ఆయన తెలిపారు.

విధుల్లో చేరిన జడ్పీ డిప్యూటీ సీఈఓ


గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

అనంతపురం విద్య, అక్టోబరు 5: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య శనివారం విధుల్లో చేరారు. జడ్పీలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కడపలో డీఎల్‌డీఓగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేసిన విషయం విదితమే. తర్వాత ఆయన జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. కొత్త డిప్యూటీ సీఈఓకు జడ్పీలోని ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న ఓబుళమ్మను కడపకు బదిలీ చేయడంతో ఆమె రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు.

లేఖ రచనపై విద్యార్థులకు పోటీలు

- తపాలాశాఖ సూపరింటెండెంట్ గుంపస్వామి

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 5: విద్యార్థుల్లో లేఖ రచనపై ఆసక్తి పెంచేందుకు తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాయ్ ఆఖర్ లెటర్ రైటింగ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ గుంపస్వామి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతలకు రూ. 25 వేలు, రూ. 15 వేలు, రూ.5 వేలు, జాతీయస్థాయిలో రూ. 50 వేలు, రూ. 25వేలు, రూ. 10 వేలు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సమీప తపాలాశాఖ కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లా : అక్టోబర్ 5: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలానగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమ రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

ఎటు నుంచి వచ్చినా డేంజరే..!

- అతివేగంతో తరచూ ప్రమాదాలు
- అనంత క్లాక్‌టవర్ బ్రిడ్జి వద్ద పొంచి ఉన్న ముప్పు


వాహనాల రాకపోకలు

స్పీడ్‌కు బ్రేకు వేస్తేనే..

అనంతపురం క్రైం, అక్టోబరు 5: అది నగరంలోని నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం. నాలుగైదు ప్రధాన ప్రాంతాలకెళ్లే వాహనాలు ఇక్కడి నుంచే వెళ్తుంటాయి. వేగంగా వెళ్తుండటంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్లాక్‌టవర్ బ్రిడ్జి ఏర్పాటైన తరువాత ఆ సమస్య ఎక్కువైంది. మొదటి రోడ్డు, రెండోరోడ్డుకెళ్లే సర్వీస్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య పీడిస్తోంది. ఇటు క్లాక్‌టవర్, కోర్టు రోడ్డు అండర్‌పాస్ నుంచి పైకి అధికసంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. అటు కళ్యాణదుర్గం నుంచి వచ్చే వాహనాలు, ఇటు లక్ష్మీనగర్‌కు వెళ్లే వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. అదే సమయంలో పీటీసీకి వెళ్లే వాహనాలతో ఆప్రాంతం రద్దీగా ఉంటుంది. వేగంగా రావడం, చూసుకోకుండా వాహనాలు ఢీ కొనడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ఆ సర్కిల్ డేంజర్ జోన్‌గా మారింది.

ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వీస్ రోడ్డు కావడమూ ట్రాఫిక్ జామ్‌కు ప్రధాన కారణమవుతోంది. దీనికితోడు రోడ్డు పక్కనే దుకాణాలుండటం, వాటికి ఎదురుగా వాహనాలు పార్కింగ్ చేయడం సమస్యగా మారుతోంది. ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చు. ఒక్కోసారి పాతూరు రోడ్లను మించిపోయే ట్రాఫిక్ ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



ఇక్కడ ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. నాలుగువైపుల నుంచి వాహనాల రాకపోకలు సాగుతుండటంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో యాక్సిడెంట్లవుతున్నాయి. స్పీడ్ బ్రేకర్లు వేస్తే బాగుంటుంది.

- నారాయణస్వామి, మూడోరోడ్డు

వంద రోజుల ప్రణాళికతో గ్రామీణాభివృద్ధి పరుగులు

డీఆర్‌డీఏ-వెలుగు సమీక్షా సమావేశంలో పీడీ ఈశ్వరయ్య


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 5: వంద రోజుల ప్రణాళికతో గ్రామీణాభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. తన చాంబర్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పురోగతిపై అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా బ్యాంకు లింకేజీ, జాబ్స్, ఉన్నతి, స్త్రీనిధి, లక్‌పతి దీదీ, సీడ్ క్యాపిటల్, ఇన్సూరెన్స్, ఐబీ, హెచ్‌డీ, ఫైనాన్స్ సబ్జెక్ట్‌ల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో డ్వాక్రా సంఘాల సంస్థాగత నిర్మాణం, బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి డ్వాక్రా సంఘానికి ముద్ర, ప్రధానమంత్రి ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్, లక్‌పతి దీదీ, లైవ్‌లీ హుడ్స్ రుణాలు విరివిగా ఇప్పించి జీవనోపాధుల పెంపు, పేదరికంపై గెలుపు, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికవృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళల రుణాల దుర్వినియోగానికి పాల్పడితే ఉద్యోగులు ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. క్రిమినల్ కేసులు, జరిమానాలతో పాటు ఉద్యోగం నుంచి తొలగిస్తారని హెచ్చరించారు. ఆయా విభాగాల అధికారులు సమయపాలన పాటించి, తమకు కేటాయించిన లక్ష్యాల సాధనకు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఎం రాధారాణి, డీపీఎంలు జిలాన్, సత్యనారాయణ, రవీంద్రబాబు, గంగాధర్, జేడీఎం సూర్యనారాయణ, హనుమాన్, పింఛన్ సెక్షన్ అజ్మతుల్లా, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

కడదాకా.. కలిసే..!

ట్రాక్టర్ బోల్తా.. స్నేహితుల మృతి


బోల్తాపడిన ట్రాక్టర్


వన్నూరుస్వామి (ఫైల్)


లక్ష్మీకాంత్ (ఫైల్)

బ్రహ్మసముద్రం, అక్టోబరు 5: ఆ ఇద్దరు యువకులు ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. ఏ పనులు చేసినా కలిసే చేసేవారు. ఒకిరికి ఒకరు అన్నట్లు స్నేహ బంధం పెనవేసుకుంది వారి నడుమ. మృత్యు దేవత కూడా వారిని విడగొట్టాలని అనుకోలేదేమో.. ఒకేసారి తీసుకువెళ్లింది. బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంట గ్రామానికి చెందిన స్నేహితులు వన్నూరుస్వామి(19), లక్ష్మీకాంత్(20) ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి మృతిచెందారు. లక్ష్మీకాంత్ పొలంలో దుక్కిదున్నేందుకు శుక్రవారం ట్రాక్టర్ తీసుకుని వెళ్లారు. గ్రామ సమీపంలోని పొలంలో దుక్కి దున్నుతుండగా భారీ వర్షం కురిసింది. దీంతో పొలంలోనే ట్రాక్టర్‌ను ఆపేశారు. ఎంతసేపటికీ వర్షం తగ్గకపోవడంతో ట్రాక్టర్‌లో ఇంటికి బయల్దేరారు. గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి పక్క పొలంలోకి బోల్తాపడింది. ట్రాక్టర్ కింద ఇరుక్కుని ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చీకటి పడినా ఇద్దరూ ఇంటికి రాకవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి గాలించారు. దీంతో ప్రమాద సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

అవకాశాలను అందిపుచ్చుకోండి

ఆధునిక యంత్రాలపై అవగాహన పెంచుకోవాలి
మహిళలకు ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ నాందేడ్ సూచన


యంత్రాలపై మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గార్లదిన్నె, అక్టోబర్ 5: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు ప్రభుత్వ అవకాశాలు, ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని వ్యవసాయ రంగంలో రాణించాలని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరిరక్షణ (ట్రాక్టర్ నగర్) సంస్థ డైరెక్టర్ బాలాజీ మురారీ నాందేడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో గత మూడు రోజుల నుంచి ట్రాక్టర్ నగర్ ఆధ్వర్యంలో మహిళలకు ఆధునిక పనిముట్లపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ బాలాజీ మురారీ నాందేడ్ మాట్లాడుతూ మహిళలు వంటిళ్లకే పరిమితం కాకుండా వ్యవసాయంలో ఆధునిక యంత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పొదుపు సంఘాల్లో చిన్న, సన్న కారు మహిళా రైతులున్నారన్నారు. వీరందరు వ్యవసాయంలో వినియోగించే ఆధునిక యంత్రాలు తోలడం నేర్చుకోవాలన్నారు. మూడు రోజుల నుంచి శిక్షణ పొందిన మహిళా రైతులకు రూ.525 భృతి ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ బాలాజీ మురారీ నాందేడ్, ఇతర అధికారులను టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య సన్మానించారు. కార్యక్రమంలో ట్రాక్టర్ నగర్ సీనియర్ ఆగ్రికల్చర్ ఇంజనీర్ విజయ్‌కుమార్, ఆగ్రికల్చర్ ఇంజనీర్ సతీష్ వర్మ, టీడీపీ జిల్లా బీసీసెల్ అధికారి ప్రతినిధి గోసుల సుబ్బయ్య, మాజీ కన్వీనర్ గోరకాటి వెంకటేష్, శిక్షకులు ఎర్రిస్వామి, భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'జీడిపల్లి'కి 955 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 5: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 955 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 858 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.644 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

వైరస్‌లా మట్కా

- కళ్యాణదుర్గంలో యథేచ్ఛగా నిర్వహణ
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- మట్కారాయుళ్లకు సహకరిస్తున్న పోలీసులు !

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 5: పట్టణంలో మట్కా వైరస్‌లా వ్యాపిస్తోంది. ఈ జూదంలో సొమ్ములు పోగొట్టుకుని కొన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దినసరి కూలీలు తమ సంపాదన మొత్తాన్ని మట్కాకు తగలబెడుతున్నారని ఆయా కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ. పదికి రూ. 800, వందకు రూ. ఎనిమిది వేలు చొప్పున ఆశ చూపుతూ కార్మికులు, నిరుద్యోగులు లక్ష్యంగా మట్కా సాగుతోంది. మట్కా విచ్చలవిడిగా విస్తరించడానికి కొందరు పోలీసులు కూడా సహకరిస్తున్నట్లు సమాచారం.

అధికార పార్టీ నాయకుడి కనసన్నల్లో

పట్టణంలో మట్కా నిర్వహణలో అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత కింగ్ మేకర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈయన వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా విచ్చలవిడిగా మట్కా బీటర్లను ప్రోత్సహిస్తూ డబ్బులు దండుకునేవాడన్న విమర్శలు ఉన్నాయి. ఒకరోజు దాదాపు పదిమంది మట్కా బీటర్లను పోలీసు లు పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే ఆగమేఘాలపై స్టేషన్లో వాలిపోయి నామ్‌కే వాస్తే చర్యలు తీసుకునే విధంగా పావులు కదిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ మట్కా కింగ్ ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి మారి, మట్కాకు యథేచ్ఛగా నిర్వహిస్తున్నాడు. పట్టణంలో దాదాపు 50 మంది మట్కా బీటర్‌ల నుంచి రోజుకు రూ. 20 లక్షల నుంచి రూ.30 లక్షలు కలెక్షన్ అవుతున్నట్లు బహిరంగంగా చర్చ నడుస్తోంది. కొన్ని రోజుల కిందట మట్కా రాసే మహిళను పోలీసులు అరెస్టు చేసి, దాదాపు తొమ్మిది లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అయితే వారం తిరిగే లోపలే ఆమె మళ్లీ మట్కా రాయడం మొదలు పెట్టింది. ఈ విషయంలో పోలీసులకు ముడుపులు అందాయనే ఆరోపణలు ఉన్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం



మట్కా నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మట్కా రాసే వారికి తరచుగా కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నాం. మట్కా రాసే వారి వెనుక ఎంత పెద్దవారున్నా ఉపేక్షించేది లేదు. ఆన్‌లైన్ మట్కాపై కూడా నిఘా వేశాం. మట్కాను సమూలంగా నిర్మూలిస్తాం.

రవిబాబు, డీఎస్పీ

బైక్‌లో ఉంచిన డబ్బు చోరీ

రూ.మూడు లక్షలు పోగొట్టుకున్న వెంకటాంపల్లి రైతు


బాధితుడు శ్రీనివాసులు

నార్పల, అక్టోబరు 5: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ వద్ద శనివారం ద్విచక్రవాహనం బ్యాగులో ఉంచిన రూ.మూడు లక్షల నగదును గుర్తుతెలియని ఇద్దరు దుండగులు చోరీ చేశారు. మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు తన భార్య పద్మావతితో కలిసి నార్పల స్టేట్‌బ్యాంక్‌లో రూ. మూడు లక్షలు డ్రా చేశాడు. ఆ డబ్బును ద్విచక్రవాహనంలోని బ్యాగులో పెట్టి, బ్యాంకు వద్ద ఉన్న దుస్తుల దుకాణంలోకి వెళ్లాడు. రైతు శ్రీనివాసులుపై అప్పటికే నిఘా పెట్టిన ఇద్దరు దుండగులు ఆ బైక్ బ్యాగ్‌లో ఉంచిన నగదు చోరీ చేశారు. దుకాణంలో పని ముగించుకుని వచ్చిన శ్రీనివాసులు బండి బాగును పరిశీలించగా అందులో డబ్బులు ఉంచిన బ్యాగ్ కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కౌలుట్లయ్య ఘటన స్థలానికి చేరుకొని బ్యాంకులో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఒక యువకుడు, నలభై ఏళ్ల వయసున్న వ్యక్తి ఇద్దరు కలిసి రెక్కీ నిర్వహించి చోరీ చేసినట్లు సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. పూర్తి విచారణ చేసి త్వరలోనే దొంగల్ని పట్టుకుంటామని సీఐ తెలిపారు. బాధిత రైతు శ్రీనివాసులు మాట్లాడుతూ పంట పెట్టుబడుల కోసం రూ.3లక్షలు డ్రా చేశానని అది కాస్త దొంగలెత్తుకెళ్లారని కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేనేతరంగంలో 70శాతం వాటా సీమదే

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 5: రాష్ట్ర చేనేత రంగంలో రాయలసీమ వాటా 70శాతమని చేనేత, జౌళిశాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్(ఆర్డీడీ) రాజారావు పేర్కొన్నారు. జిల్లాకు వచ్చిన ఆయన ఆశాఖ ప్రగతిపై సమీక్షను శనివారం నిర్వహించారు. జిల్లా అదనపు డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమీక్షలో రాజారావు మాట్లాడుతూ ముద్రా రుణాల టార్గెట్‌ను వంద రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. క్లస్టర్లు, వర్క్‌షెడ్లు, కొత్త సొసైటీల ఏర్పాటు, ప్రధాన లక్ష్యమన్నారు. కనీసం 30మంది చేనేతలతో నూతన సొసైటీలను ఏర్పాటుచేయాలన్నారు. సొంత పెట్టుపెబడితో వస్త్రాలను తయారుచేసే సొసైటీలకు ఎన్ఎస్ఎఫ్‌డీసీ, నూలు తదితరాలకు ప్రభుత్వ రాయితీలు చెల్లిస్తుందని తెలిపారు. అనంతపురంలో 5, సత్యసాయిలో 3, వెంకటగిరిలో 7 ఇలా ప్రతి జిల్లాలోనూ చేనేత సొసైటీలను ఏర్పాటు చేస్తామన్నారు. వంద యూనిట్లవరకు ఉచిత కరెంట్, 5వ పథకం ద్వారా 50శాతం పెట్టుబడి సబ్సిడీ, జీఎస్టీ రీయంబర్స్‌మెంట్ వంటివి చేనేతలకు ఆర్థికభారాన్ని తగ్గిస్తాయన్నారు. కార్యక్రమంలో డెవలప్‌మెట్ ఆఫీసర్ బసవరాజు, ఏడీఓలు శ్రీనివాసులు, నరసింహారెడ్డి, మురళీమోహన్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా వీఆర్ఏల జిల్లా కమిటీ ఎన్నిక


వీఆర్ఏల జిల్లా కమిటీ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5: వీఆర్ఏల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ ఉద్యోగులభవన్ కార్యాలయంలో శనివారం అమరావతి జేఏసీ జిల్లా చైర్మన్ దివాకరరావు, వీఆర్ఏల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్యల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్ఓల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఓబులేసు(శింగనమల)జిల్లా ప్రధానకార్యదర్శిగా నాగరాజు (యాడికి)ను ఎన్నుకున్నారు జిల్లా ఉపాధ్యక్షులుగా తలారినాగరాజు, బాల ఓబులేసు, సందీప్, ఎర్రిస్వామి, జిల్లా కోశాధికారిగా విజయ, జిల్లా సహాధ్యక్షుడిగా సీతారాం, జిల్లా కార్యవర్గ సభ్యులుగా రవిచంద్ర, చంద్రమోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని దివాకరరావు, బ్రహ్మయ్య తెలిపారు.

క్రైం న్యూస్ ...

మిస్టరీగా సీఐ తల్లి మిస్సింగ్ కేసు


స్వర్ణకుమారి

మదనపల్లె టౌన్, అక్టోబరు 5: ధర్మవరం వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి, మదనపల్లెలో నివాసముంటున్న స్వర్ణకుమారి (65) మిస్సింగ్ కేసు మిస్టరీగా మారింది. నాగేంద్రప్రసాద్ భార్య, పిల్లలు ధర్మవరంలోనే నివాసముంటున్నారు. ఆయన తల్లి స్వర్ణకుమారి మదనపల్లె పట్టణ శివారులోని జగన్ కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటోంది. గత నెల 28వ తేదీ శనివారం ఉదయం ఆమె ఇంటి ముందు నివాసమున్న వెంకటేశ్ స్వర్ణకుమారిని పూజ కోసమని తీసుకెళ్లాడు. నాటి నుంచి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితురాలు ఫోన్ చేయగా కాల్ ఫార్వర్డ్ వాయిస్ వినిపించింది. మంగళవారమైనా ఆమె రాకపోవడంతో వారు నాగేంద్రప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన మదనపల్లె తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వర్ణకుమారి ఒంటిపై ఉండాల్సిన నగలు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉన్నట్లు గుర్తించారు. 28వ తేదీ సాయంత్రమే రూ.4.50 లక్షలకు ఆ నగలు కుదువ పెట్టినట్లు తెలుసుకున్నారు. అనుమానితుడు వెంకటేశ్ ఆది, సోమవారాలు ఇంటి వద్దనే ఉన్నా... అతడిపై పోలీసులకు అనుమానం రావడంతో అతను పారిపోయాడని తెలిసింది. వెంకటేశ్ తన మొబైల్‌ఫోను స్విచ్ ఆఫ్ చేయడమే కాక సిమ్‌ను తీసి ఇంట్లోనే పడేసి వెళ్లినట్లు సమాచారం. వెంకటేశ్‌కు మదనపల్లె పట్టణానికి చెందిన ఓ యువకుడు సహకరించినట్లు సమాచారం. దీంతో వీరిద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. స్వర్ణకుమారి కర్ణాటక రాష్ట్రంలో ఉన్నట్లు సమాచారం వచ్చిందని, దీనిపై బెంగళూరుకు రెండు టీములుగా పోలీసులను పంపామని, వీలైనంత త్వరగా ఈ కేసు ఛేదిస్తామని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు.

చీనీమొక్కల నరికివేత



బత్తలపల్లి, అక్టోబరు 5: మండలంలోని తంబాపురం గ్రామానికి జనసేన కార్యకర్త, రైతు రమణా రెడ్డికి చెందిన చీనీ మొక్కలను గుర్తు తెలియని దుండగులు నరికి వేశారు. తాను రెండు ఎకరాల్లో మొత్తం 273 చీనీ మొక్కలను మూడు సంవత్సరాలుగా సాగు చేస్తుండగా... శుక్రవారం రాత్రి 50 మొక్కలను దుండగులు నరికి వేసినట్లు బాధిత రైతు రమణారెడ్డి వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చీనీమొక్కలు మేపారని ఫిర్యాదు

ధర్మవరంరూరల్, అక్టోబరు 5: మండలంలోని ఉప్పునేసినపల్లిలో వన్నప్పకు చెందిన చీనీమొక్కలను ఆ గ్రామంలోని గొర్రెల కాపరుల వాళ్లు మేపారని, దీంతో తాను తీవ్రంగా నష్టపోయానని బాధితుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తనకున్న 2.40 ఎకరాల్లో 280 చీనీమొక్కలు సాగుచేశానని, ఇప్పటికి సాగుచేసి ఒక సంవత్సరం అవుతోందని అన్నారు. రెండురోజులుగా పొలం వద్దకు వెళ్లలేదని, శనివారం ఉదయం పొలంలోకి వెళ్లగా మొక్కలన్నీ గొర్రెలు మేసినట్లుగా కనిపించాయని వాపోయాడు. మొక్కలకు ఉన్న ఆకులన్నీ తినేవేయడంతో పాటు మరికొన్ని మొక్కలను గొర్రెలు తొక్కేయడంతో తనకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఇసుక వాహనాల సీజ్

బత్తలపల్లి, సెప్టెంబరు 5: మండలంలోని చిత్రవతి నది నుంచి శనివారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

కొత్తచెరువు, అక్టోబరు 5: చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సును స్థానిక బీసీ కాలనీలో శనివారం నిర్వహించారు. జిల్లా ఐసీడీఎస్ పీడీ నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ... మహిళలందరూ చదువుకున్నప్పుడే చట్టాలపై అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ ఇందిరా, సీడీపీఓ గాయత్రి, న్యాయవాదులు నాగేంద్ర, మౌనిక, రహిమాన్, ఐసీడీఎస్ లీగల్ సర్వీసు బిందు పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం న్యాయ సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు నరసింహులు, లోకేశ్వర్‌రెడ్డి, రెడ్స్ భానుజా మాట్లాడుతూ.. మహిళ సంక్షేమం, సంరక్షణ, చైతన్యం కోసం ఈ న్యాయ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వరకట్నం వేధింపులు, హత్యలు, మహిళ అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, లైగింక వేధింపులు, బాల్యవివాహాల తదిర వాటిపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, సీనియర్ అసిస్టెంట్ షేక్షావలీ, ఐసీడీఎస్ సత్యవతి, లేబర్ అధికారి జహీరుద్దీన్ పాల్గొన్నారు.

మండల సమాఖ్యలో వార్షిక మహాసభ

గాండ్లపెంట, అక్టోబరు 5: స్థానిక ప్రగతి మండల సమాఖ్య 27 వార్షిక మహాసభను శనివారం నిర్వహించారు. ఈసభలో నూతన పాలకవర్గ సభ్యులను ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా నూర్జహాన్, ఉపాధ్యక్షురాలిగా సూజాలను ఎన్నుకున్నారు. రాబోయే వార్షిక సంవత్సరం ప్రణాళిక, బడ్జెట్ ఆమోదం, తదతరాంశాలపై ఏపీఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం వేణు, సీసీలు ప్రసాద్, షాకీర్, నిర్మలమ్మ, రఘునాథ్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

ధర్మవరంరూరల్, అక్టోబరు 5: మండలంలోని చిగిచెర్లలో ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త ఆనంద్ తల్లి నాగమ్మ మూత్రపిండల వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ జడ్పీచైర్మన్ టీడీపీ సీనియర్ నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి శనివారం ఆమె ఇంటికి వెళ్లి చికిత్స నిమితం రూ. 10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థారెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, శీల్లా ఆనంద్, అశోక్, మూర్తి, హేమంత్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు

గాండ్లపెంట, అక్టోబరు 5: వన్యప్రాణుల సంరక్షణపై స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్యప్రాణులు అంతరించపోకుండా వాటిని సరంక్షించడానికి తమవంతుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ దామోదర్, బీట్ ఆఫీసర్లు కుల్లాయప్ప, అనీల్ కుమార్, బ్రహ్మయ్య, ఆదర్శ పాఠశాల హెచ్ఎం మల్లికార్జున పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ పోటీల్లో విజేత ధర్మవరం

ధర్మవరంరూరల్, అక్టోబరు 5: స్థానిక తారకరామాపురం వద్ద ఉన్న ఆర్డీటీ గ్రౌండ్‌లో ఆర్డీటీ, ఏడీసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల క్రికెట్ పోటీల్లో ధర్మవరం జట్టు విజేతగా నిలిచింది. శనివారం ఈ పోటీలను ఆర్డీటీ టీం ఏరియా టీం లీడర్ శ్రీనివాసులు ప్రారంభించారు. హిందూపురం అండర్-16 బాలికల జట్టు, ధర్మవరం అండర్-16 బాలికల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు 30 ఓవర్లలో 165 పరుగులు చేశారు. అనంతరం ధర్మవరం జట్టు 19 ఓవర్లలో ఏడు వికెట్లు తేడాతో 166 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. ధర్మవరం జట్టులోని హస్మిత 55 పరుగులు చేసి విజయానికి బాసటాగా నిలిచింది. ధర్మవరం జట్టును పలువురు క్రీడాకారులు, కోచ్ రాజశేఖర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన జిల్లా టీచర్లు

ధర్మవరం, అక్టోబరు 5: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి గుంటూరులోని నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన టీచర్లు ప్రతిభ కనబరిచినట్టు జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి చెస్ విభాగంలో మహిళా టీచర్లు, పరుగు పందెం పోటీల్లో పురుష టీచర్లు విజేతలుగా నిలిచారన్నారు. చెస్ పోటీల్లో సీతామహలక్ష్మీ, సబిమాబాను, 100 పరుగు పందెం పోటీల్లో జీసీ నరేశ్‌కుమార్, 400 మీటర్ల నడక విభాగంలో కె.శరణు, ముకేంద్ర ప్రతిభచాటారన్నారు.

వానొస్తే ఇక్కట్లే..

- రైల్వే అండర్ బ్రిడ్జీల వద్ద నిలుస్తున్న నీరు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ధర్నాలు, రాస్తారోకోలు చేసినా స్పందన శూన్యం
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల వాసులు


బాలసముద్రం రైల్వే బ్రిడ్జి కింద నీటిలో వస్తున్న విద్యార్థులు (ఫైల్)

తనకల్లు వద్ద రైల్వే బ్రిడ్జి వద్ద నీటిలో వెళ్తున్న ద్విచక్రవాహనదారులు (ఇన్‌సెట్లో)

తనకల్లు, అక్టోబరు 5: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని, కొక్కంటి క్రాస్ వద్ద ఉన్న రైల్వే గేట్లను అధికారులు అనాలోచితంగా మూసివేశారు. దీంతో పలు గ్రామాల వారు రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారానే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సుమారు 15 గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొక్కంటి క్రాస్ వద్ద ఉన్న గేట్ మూసివేయడంతో బాలసముద్రం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి బాలసముద్రం, టి.సదుం, నందిగానిపల్లి, అగ్రహారం, ఎర్రచెరువుపల్లి, గ్రామాల వాసులు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే తనకల్లు సమీపంలో రైల్వే గేట్ మూసివేయడంతో వంకపల్లి, చిన్నకడపలవారిపల్లి, గోళ్లవారిపల్లి, దుగినేపల్లి, పెద్దకడపలవారిపల్లి, కుంటమరవ, కనసానివారిపల్లి, నల్లచెరువు మండలంలోని ఓరువాయి, పల్లెవాండ్లపల్లి, బోనేపల్లి గ్రామస్థులు ఆ గేట్‌కు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాల్సి ఉంది. అయితే ఓ చిన్నపాటి వాన కురిసిన ఈ వంతెనల కింద నీరు భారీగా నిల్వ ఉంటోంది. దీంతో ఈ గ్రామాల వారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని బాధిత గ్రామస్థులు పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా.. పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. బాలసముద్రం ప్రాథమిక పాఠశాల రైల్వే బ్రిడ్జి ఇటు వైపు ఉండగా.. గ్రామం అటు వైపు ఉంది. దీంతో వర్షం వస్తే రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలుస్తుండటంతో విద్యార్థులు నడుముల లోతు నీళ్లల్లో పుస్తకాలు మోసుకొంటూ.. వెళ్లకతప్పడం లేదు. తనకల్లు వద్ద రైల్వే బ్రిడ్జి వద్ద నిల్వ ఉన్న నీటిలోనే ద్విచక్రవాహనదారులు సాహసం చేస్తూ వెళ్తున్నారు. ఇలా వెళ్తూ అనేక మంది కిందపడి.. గాయపడ్డారు. ఈ సమస్యను పరిష్కరించాలని నాటి ఎంపీ గోరంట్ల మాధవ్ వద్ద మొరపెట్టుకున్నా ఏ మాత్రం పట్టించుకోలేదని బాధిత గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా పడుతున్న తెలికపాటి జల్లులకే ఈ రైల్వే బ్రిడ్జిలు కింద నీరు నిల్వ ఉంటోంది. ఎమ్మెల్యే కందికంట వెంకటప్రసాద్, కూటమి పాలకులైనా స్పందించి.. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అత్యవసర సమయంలో నరకం



రాత్రి సమయంలో చిన్నారులకు, వృద్ధులకు అత్యవసర సమస్యలు వస్తే ఇక మా బాధలు అన్నిఇన్నికావు. బ్రిడ్జీల కింద నీరు ఉంటే కత్తిమీద సామే. సమస్య పరిష్కరించాలని ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వాన్ని కోరినా స్పందించలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించాలి.

- రాజు, బాలసముద్రం

ఎమ్మెల్యే కందికుంటకు చెప్పాం



ఈ సమస్యను ఇప్పటికే కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సంబంధిత రైల్వే అధికారులతో చర్చించి, సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో తప్పకుండా ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

- చిన్నప్ప, టీడీపీ నాయకుడు, వంకపల్లి

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 5: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించారు. కందికుంట నారాయణమ్మ చారిట బుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఉచిత డీఎస్సీ శిక్షణలో సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. 22 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు అందిస్తున్న కందికుంట నారాయణమ్మ చార్టిబుల్ ట్రస్టు ఆర్గనైజర్ నగేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కందికుంట ప్రారంభించారు. ఈ శిబిరంలో దాదాపు 800 మంది చికిత్సలు చేయించుకున్నారు. ఈ శిబిరానికి వైదేహి వైద్యశాల వారు సహకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చెన్నక్రిష్ణ, టీడీపీ నాయకులు నాగప్ప, శంకర్, గంగయ్య, ఓబులరెడ్డి, డీఎస్సీ కోచింగ్ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వెంకట రమేష్, పవన్‌కుమార్, సునిల్ కుమార్, మనోహర్, రవీనాయక్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ

గాండ్లపెంట, అక్టోబరు 5: విధుల్లో అధికారుల నిర్లక్ష్యంపై సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఇన్‌చార్జీ ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సోమయాజులపల్లి ఎంపీటీ జయరామక్రిష్టారెడ్డి, కురుమామిడి సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ.. వివిధ శాఖలాధికారులు సమయ పాలన పాటించడంలేదని మండిపడ్డారు. ప్రజా సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో వేళపాలా పాటించడం లేదని, మోనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించలేదని అన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు ఎపుడు వస్తారో పోతారో తెలియడంలేదన్నారు. 15వ ఆర్థిక సంవత్సర నిధులపై ఏపంచాయతీకి ఎంతెంత నిధులు విడుదల చేశారో చెపాలన్నారు. కురమామిడి పంచాతీయతీలోని రెక్కమాను, పాయకట్టు గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశామని, వెంటనే బిల్లులు చెల్లించాలని సర్పంచ్ సుధాకర్ కోరారు. సమావేశానికి రెవెన్యూ, ఆర్డీసీ, సిరికల్చర్, ఇరిగేషన్, అటవీశాఖ, ఉద్యానవన, మత్స్యశాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



కదిరి, అక్టోబరు 5: ఆశ్వయుజ మాసం మొదటి శనివారం సందర్భంగా స్థానిక శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారి దర్శనంతో పాపా విమోచనం కలుగుతుందని భక్తుల నమ్మకం. దసరా సెలవులు కావడంతో శుక్రవారం రాత్రి నుంచే ఆలయం భక్తులతో రద్దీగా మారింది. శనివారం కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. భక్తులకు అన్నసంతర్పణం చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వరద బాధితులకు రూ.50 వేలు విరాళం



ఓబుళదేవరచెరువు: విజయవాడ వరద బాధితులకు టీడీపీ యువ నాయకుడు ఇనగలూరు సిద్ధా చలపతి నాయుడు రూ. 50 వేలను విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అనంతపురంలో అందజేశారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



నల్లచెరువు: పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పెద్దయల్లంపల్లి ఆంజనేయులు, జానకమ్మ భక్తులకు అన్నసంతర్పణం చేసినట్లు ఈఓ రవీంద్రరాజు తెలిపారు.

పలు రూపాల్లో అమ్మవారు



ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని మూడో రోజైన శనివారం అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పుట్టపర్తిలో శాకంబరిగా అమ్మవారు..


ధర్మవరం శ్రీనివాసనగర్‌లో వరాహ అలంకరణలో వెంకటేశ్వరస్వామి


ముదిగుబ్బలో వెంకటేశ్వర అలంకారంలో వాసవీమాత

యానిమేటర్ల తొలగింపు అక్రమం: సీఐటీయూ

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 5: జిల్లాలో డ్వాక్రా సంఘాలకు యానిమేటర్లగా పనిచేస్తున్న పలువురు చిరుద్యోగులను తొలగించడం అక్రమమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం ఎదుట బాధిత యానిమేటర్ల, సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన విధంగానే కూటమి ప్రభుత్వం కూడా చిరుద్యోగులను కక్షకట్టి తొలగించడం దారుణమన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను కూటమి ప్రభుత్వమూ చేయడం సరికాదన్నారు. తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సమర్థవంతంగా విధులు నిర్వహించకపోవడంతో చిరుద్యోగులు బలవుతున్నారని ఆరోపించారు. తక్షణమే బాధిత యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు.



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పుట్టపర్తి ఆర్డీఓగా పారపాటి సువర్ణ



పుట్టపర్తిరూరల్, అక్టోబరు 5: పుట్టపర్తి ఆర్డీఓగా పారపాటి సువర్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఆర్డీఓ కేఎస్ భాగ్యరేఖను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. తూర్పుగోదావరి జిల్లాలో గ్రూప్ -1 ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సువర్ణను ఇక్కడికి ఆర్డీఓగా ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు.

ఎస్ఐగా శ్రీరాములు



పుట్టపర్తిరూరల్, అక్టోబరు 5: పుట్టపర్తి అర్బన్ ఎస్ఐగా సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న శ్రీరాములు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్ఐ రామచంద్రుడు అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు బదిలీపై వెళ్లారు.

ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి



ఓబుళదేవరచెరువు, అక్టోబరు 5: ఎస్ఐగా బి. మల్లికార్జునరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్ఐ వంశీకృష్ణ సీఐగా ఉద్యోగోన్నతిపై కళ్యాణదుర్గం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కనగానిపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఇక్కడికి బదిలీ అయ్యారు.

ఏపీఎంగా రవీంద్ర

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 5: మండల వెలుగు కార్యాలయంలోని డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎంగా కుచ్చె రవీంద్ర శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏపీఎం రమణప్ప జిల్లా కేంద్ర కార్యాలయానికి బదిలీకాగా, అతని స్థానంలో నల్లచెరువు ఏపీఎం రవీంద్ర ఇక్కడికి వచ్చారు.

ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా వెంకటరమణాచారి

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 5: మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా వెంకటరమణాచారి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏఓ ఇలియాజ్ అహమ్మద్ సెలవుపై వెళ్లడంతో అతని స్థానంలో అమడగూరు వ్యవసాయాధికారి వెంకటరమణనాయక్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కోర్టులో స్వచ్ఛతాహీ సేవ

కదిరిలీగల్, అక్టోబరు 5: స్థానిక కోర్టు ఆవరణాన్ని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం శుభ్రం చేశారు. మొదట న్యాయాధికారి జయలక్ష్మి ఆధ్వర్యంలో కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించింది. అనంతరం కోర్టు ఆవరణంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూ.. స్వచ్ఛత అన్నది కేవలం పరిసరాల పరిశుభ్రతకు మాత్రమే పరిమితం చేయకుండా... మనిషి ఆలోచనలు, మనసు కూడా వర్తింపజేసుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం, జీవనం సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, కోర్టు సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


పరిసరాలను శుభ్రం చేస్తున్న న్యాయాధికారి జయలక్ష్మి

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

పరిగి, అక్టోబరు 5 : మండల పరిధిలోని ధనాపురం ఎస్సీ కాలనీకి చెందిన రొడ్డలప్పగారి మాధవి(31) చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. లక్ష్మీనారాయణ భార్య మాధవి రెండు రోజుల క్రితం కనబడకుండా పోయింది. శనివారం ఉదయం పరిగి చెరువులో మృతదేహం తేలాడుతున్నట్లు స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మాధవికి మతిస్థిమితం సరిగా లేదని, గతంలోనే రెండుసార్లు ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా నిజాముద్దీన్

రొళ్ల, అక్టోబరు 5 : విద్యుత్ శాఖ మండల ఏఈగా నిజాముద్దీన్ బాధ్యతలు తీసుకొన్నారు. ఈయన హిందూపురం ఏఈగా ఉంటూ బదిలీపై రొళ్ల మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏఈ నిజాముద్దీన్ మాట్లాడుతూ అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

స్థల వివాదంపై పోలీసులకు ఫిర్యాదు

గోరంట్ల, అక్టోబరు 5: మండలంలోని గౌనివారిపల్లి వద్ద రెండు సెంట్ల ప్రభుత్వ స్థల వివాదంపై స్థానిక టీడీపీ నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గౌనివారిపల్లి ఆర్‌డీటీ పాఠశాలలో జ్యూట్ బ్యాగుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు గోరంట్ల తహసల్దార్ సర్వేనెంబర్ 683లోని గ్రామ కంఠం స్థలంలో రెండు సెంట్లను రెండు రోజుల క్రితం సర్వేయర్‌ద్వారా జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అదే గ్రామానికి చెందిన ఆనంద్‌రెడ్డి తన ఇంటి పక్కన గల ప్రభుత్వ స్థలం తనదేనంటూ ఎక్స్‌కవేటర్ ద్వారా చదును చేయించారు. దీంతో టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ తిరుపాల్ ఆధ్వర్యంలో సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేశారు.

108లోనే ప్రసవం

గోరంట్ల, అక్టోబరు 5: మండలంలోని చిన్ననారప్పపల్లికి చెందిన నందిని అనే మహిళ పురిటి నొప్పులతో ఉండగా 108 వాహనంలో సిబ్బంది మార్గమధ్యలోనే శనివారం తెల్లవారుజామున సుఖప్రసవం చేశారు. చిన్ననారప్పపల్లి ఆంజనేయులు భార్య నందిని రెండో ప్రసవం కోసం 108లో గోరంట్లకు వస్తుండగా శుక్రవారం రాత్రి 1 గంటల సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. ఆ సమయంలో తీవ్రంగా వర్షం కురుస్తుండడంతో సింగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన వాహనం ఆపి పైలెట్ నరసింహులు, ఈఎంటీ రామాంజనేయులు ప్రసవం చేశారు. నందిని పండింటి ఆడబిడ్డకు జన్మనించారు. అనంతరం గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు పెనుకొండలో ప్రజాదర్బార్

పెనుకొండ టౌన్, అక్టోబరు 5: బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పెనుకొండలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం అధికారులు ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలతో పనిచేయిస్తే చర్యలు

సోమందేపల్లి, అక్టోబరు 5: పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వివిధ షాపులను అంగనవాడీ టీచర్లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14ఏళ్లలోపు బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. హోటళ్లు, వెల్డింగ్ షాపులు, మెకానిక్, టీషాపులు, దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.

వివాదాస్పద స్థలంపై తహసీల్దార్ విచారణ

గోరంట్ల, అక్టోబరు 5: మండలంలోని మందలపల్లిలో వివాదాస్పదంగా ఉన్న 90 సెంట్ల స్థలాన్ని రెండేళ్ల క్రితం విక్రయించిన బాలక్రిష్ణకు ఎలాంటి హక్కులేదని గోరంట్ల తహసీల్దార్ మారుతి శనివారం తేల్చి చెప్పారు. పెనుకొండకు చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి రఫీక్ కణేకల్లులోని ఆసియాభానుకు వివాద స్థలాన్ని విక్రయిస్తూ అగ్రిమెంటు ద్వారా రూ. 10 లక్షలు తీసుకున్నారు. సదరు స్థలం వివాదంలో ఉండడంతో కొన్నవారి ఒత్తిడి తట్టుకోలేక రఫీక్ పెనుకొండ మార్కెట్‌యార్డులో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోరంట్ల తహసీల్దార్ మందలపల్లికి వెళ్లి స్థల వివాదంపై శనివారం విచారణ చేశారు. ఒకే స్థలంపై మూడు కేసులు కోర్టులో నడుస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు.

పలుచోట్ల వర్షం

మడకశిర టౌన్, అక్టోబరు 5: నియోజకవర్గం వ్యాప్తంగా గత మూడు రోజులుగా ఓ మోస్తారుగా వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి అత్యధికంగా గుడిబండ మండలంలో 82 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. మడకశిరలో 54.4 మి.మీ., అమరాపురంలో 32.4, రొళ్లలో 29.4 , అగళిలో 38.4 మి.మీ. వర్షపాతం నమోదయింది.

పిచ్చి మొక్కలు తిని మేకలు మృతి

రొళ్ల, అక్టోబరు 5: మండలంలోని హనిసేకుంట గ్రామంలో పిచ్చిమొక్కలు తిని 10 మేకలు మృతి చెందినట్లు బాధిత రైతులు గోవిందప్ప, రవికుమార్, రాజన్న తెలిపారు. ఉదయం మేకలను బయలు ప్రాంతానికి మేతకోసం తీసుకెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి తోలుకొని వచ్చిన తరువాత మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. రవికుమార్ 3 మేకలు, రాజన్నవి 5 మేకలు, గోవిందప్ప 2 మేకలు మృతి చెందాయి. ఒక్కక్క మేక రూ.10వేలు చేస్తుందని, దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాల్లిందని వారు వాపోయారు.

టీడీపీ నాయకుడి మృతికి బీకే సంతాపం

పెనుకొండ రూరల్, అక్టోబరు 5 : మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బుడ్డన్న శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ బీకే పార్థసారథి హరిపురం గ్రామానికి చేరుకుని బుడ్డన్న మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు..

బదిలీ అధికారులకు సన్మానం

గుడిబండ, అక్టోబరు 5: మండలంలో పనిచేస్తూ వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులను శనివారం ఆయా కార్యాలయాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తూ అమరాపురానికి బదిలీ అయిన రామారావు, ఏఓగా పనిచేస్తూ పెనుకొండ పంచాయతీరాజ్‌కు బదిలీ అయిన నారాయణప్ప, రాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ రొద్దం పంచాయతీకి బదిలీ అయిన గోవిందప్ప, మోరుబాగల్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ సోమందేపల్లికి బదిలీ అయిన రమేష్‌ను సన్మానించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

పావగడ, అక్టోబరు 5: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డి.టి.శ్రీనివాస్ తెలియజేశారు. శనివారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఒకటిన్నర సంవత్సరం నుంచి ఉపాధ్యాయుల సమస్యలు తలెత్తకుండా ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎన్నో ప్రణాళికలు సృష్టించి అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు.

సెలవుల్లో చిన్నారులు భద్రం..!

● పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి ● ప్రాణాలు తీస్తున్న ఈత సరదా ● నీటి వద్ద సెల్ఫీలతో ముప్పు


సరదాగా ఈత కొడుతున్న యువకులు (ఫైల్)

హిందూపురం, అక్టోబరు 5 : దసరా సెలవులు వచ్చాయంటే విద్యార్థుల ఆనందానికి అవధులుండవు. జూన్‌లో విద్యాసంస్థలు ప్రారంభమయ్యాక ఎక్కువ రోజులు సెలవులు వచ్చేది దసరాకే దీంతో సెలవులు వదిలారంటే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు వసతిగృహాల నుంచి ఎగిరి గంతేసి ఇళ్లకు చేరుకుంటారు. నాలుగు నెలలపాటు చదివి ఒక్కసారిగా సెలవులు రావడంతో సొంతూరులోనూ, అమ్మమ్మ ఊరికో, బంధువుల ఊళ్లకో వెళతారు. అసలే వర్షాకాలం చెరువులతోపాటు చిన్న చిన్న కుంటల్లో నీరున్నాయి. సరదాగా ఈత కొట్టేందుకు నీటిలో దిగుదామని చేసే ప్రయత్నాలు తల్లిదండ్రులతోపాటు బంధువులకు తీరని శోకాన్ని మిగుల్చుతాయి. అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలు నీటిలో కలిసిపోతాయి. వారిపై తల్లిదండ్రులు పర్యవేక్షణ చాలా అవసరం. గతయేడాది హిందూపురం మండలం సంతేబిదనూరు సమీపంలో పెన్నానదిలో ఈత కొట్టడానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు కుంటలో పడి మృతిచెందారు. అదే దసరా సెలవుల్లో కర్ణాటకలో చదువుతున్న విద్యార్థులు చౌళూరు వద్దకు వచ్చి నదీపరివాహక సమీపంలో ఉన్న కుంటలో ఈత కొట్టడానికి వెళ్లి మునిగిపోయారు. హిందూపురం పట్టణం రహమత్‌పురానికి చెందిన ఓ బాలుడు కుటుంబ సభ్యుల వెంట కొటిపి చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. వేసవి సెలవుల్లో చిలమత్తూరు మండలంలో అటవీప్రాంతంలో ఉన్న కొండల మధ్యలో గ్రానైట్ తవ్వకాలతో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో నీరు భారీగా నిలిచింది. వేసవి కదా అని కుటుంబంతో కలిసి వెళ్లాడు. అందులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఇదే సెలవుల్లో మరికొంతమంది విద్యార్థులు ఈతకొట్టడానికి వెళ్లగా ఒక విద్యార్థి గుంతలోపడి మృతిచెందాడు. పరిగి చెరువువద్ద ఆడుకోవడానికి వెళ్లిన విద్యార్థుల్లో ఒకరు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందాడు.

నీరు చూస్తే ఆరాటం

చాలా మంది పిల్లలు తల్లిదండ్రులకు తెలియకుండా కాలువల్లో, చెరువుల్లో, కుంటల్లో ఈత కొడదామంటూ స్నేహితులతో కలిసి వెళ్లిపోతారు. అందులో ఒకరిద్దరికే ఈత వస్తుంది. మిగిలిన వారికి రాకపోవచ్చు. అలాంటి సమయంలో స్నేహితులు ఏం కాదులే అంటూ ఈత వచ్చినవారు నీటిలో దూకుతారు. రాని వారు కూడా నీటిలో దూకేస్తారు. ఈతరాక ప్రమాదాల్లో మృతిచెందుతుంటారు. తల్లిదండ్రులు ముందస్తుగా హెచ్చరించాలి. నీరున్న ప్రాంతాలకు వెళ్లకుండా చూసుకోవాలి. మరికొందరు నీటి వద్ద, బ్రిడ్జిలపై సెల్ఫీలు దిగుతారు. అంచున ఉన్నామని మరిచిపోయి సెల్ఫీ దిగే క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు నీటిలో పడి కనుమరుగవుతున్నారు.

ఇలా చేయాలి ..

దసరా సెలవుల్లో పిల్లలు ఇంటిపట్టునే బుద్ధిగా ఉండేలా చేయడం కొంత కష్టమే. వారికి ఇష్టమైన పనులు చేయిస్తూ ఇంటిపట్టునే ఉండేలా చూసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. బడుల్లో ఎప్పుడూ పాఠాలు, హోమ్‌వర్క్‌లతో సతమతమవుతుంటారు. ఈ వారంలో పుస్తకాలకు దూరంగా ఉంచాలి. పెయింటింగ్‌లు నేర్పించాలి. ఆదివారం పత్రికల్లో ప్రచురించే అనుబంధ పుస్తకాల్లో పిల్లల కోసం ప్రత్యేక పేజీలను చదివించేలా ప్రోత్సహించాలి. ఇల్లు, లేదా పొలం వద్దకు తల్లిదండ్రులు పిల్లలను తీసుకెళ్లి ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోయించాలి. సెలవుల్లో నీటివైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

జగములేలు తల్లీ.. జగత్ జననీ..!

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

'జగములేలు తల్లి.. జగత్ జననీ..' అంటూ భక్తులు పలుచోట్ల అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలో దేవాతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. హిందూపురంలోని ప్రసిద్ధ పేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం అభిషేకార్చనలు చేసి మూలవిరాట్ పేట వేంకటరమణుడిని ఉగ్రనరసింహునిగా అలంకరించారు. నింకపల్లి రోడ్డులోని యల్లమ్మ ఆలయంలో అక్షింతలతో అన్నపూర్ణేశ్వరిదేవిగా ముస్తాబు చేశారు. సాధుచెట్టి సంఘం ఆధ్వర్యంలో పత్తితో జలదుర్గాదేవి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కొల్హాపురి లక్ష్మీ అమ్మవారి ఆలయంలో చంద్రగంట అలంకరణలో తీర్చిదిద్దారు. పెనుకొండలో ని లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారిని వరాహ రూపంలో, శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి రూపంలో అలంకరించారు. చంద్రగిరి గ్రామంలో వెలసిన శ్రీగిరి శక్తిపీఠం ఆలయంలో మహేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడకశిర పట్టణంలోని గాంధీ బజార్‌లో వెలిసిన కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకరణలో కొలువు దీర్చారు. మారమ్మ దేవాలయంలో అమ్మవారికి విశేషంగా అలంకరించారు. గంగాపూజమ్మ, కొల్లాపురమ్మ, వడిసిలమ్మతోపాటు అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమందేపల్లిలోని శివాలయాలు, వెంకటేశ్వరస్వామి, చౌడేశ్వరీ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. చిలమత్తూరు మండలంలో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడూరులో వెలసిన చౌడేశ్వరీ మాతకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.


హిందూపురంలో జలదుర్గాదేవి, పెనుకొండలో అన్నపూర్ణేశ్వరి, మడకశిరలో కన్యకాపరమేశ్వరి అలంకరణలో అమ్మవారు

పేదలందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యం : ఎమ్మెల్యే

మడకశిరటౌన్/అమరాపురం/అగళి, అక్టోబరు 5 : నియోజకవర్గంలో ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శనివారం రాత్రి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇచ్చే విధంగా సూచించారని తెలిపారు. నియోజకవర్గంలో 10వేల ఇళ్లు కావాలని తాము ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇల్లులేదు అని ఏ ఒక్క పేదవారు తమ వద్దకు రాకూడదని, క్షేత్రస్థాయిలో అధికారులు స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రతి ఒక్కరిని గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, నాయకులు లక్ష్మీనారాయణ, మనోహర్ పాల్గొన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. హేమావతి సిద్దేశ్వరస్వామి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.12లక్షలతో శౌచాలయం, స్నానపు గదుల ఏర్పాటుకు శనివారం సాయంత్రం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మనూనాయక్, ఎంపీడీఓ రామారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరీష్, నాయకులు గణేష్, జయకుమార్, నరసింహ నరసింహమూర్తి, శివరుద్రప్ప, కుమారస్వామి పాల్గొన్నారు. అగళి మండలం మధుడి గ్రామంలో తాగునీటి వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. అనంతరం ఆర్‌జీపల్లిలో గ్రామ సచివాలయాలన్ని ప్రారంభించారు. ఆర్‌జీపల్లి సర్పంచ్ సన్నమ్మ, భర్త రంగయ్యతోపాటు వైసీపీ నాయకులు 50కుటుంబాలు తెలుగుదేశంపార్టీలో చేరారు. వారికి కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వీఎం పాండురంగప్ప, జడ్పీటీసీ ఉమేష్, కుమారస్వామి, నరసింహమూర్తి, రమేష్, చంద్రప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

పరిగి, అక్టోబరు 5 : ప్రతి మహిళ చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని అన్నారు. బాధితులు తెల్లకాగితంపై సమస్యలు తెలియజేస్తే అందుకు అనుగుణంగా నోటీసులు జారీచేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ ఎలా ఉపయోగించాలి, పిల్లలు తప్పుచేస్తే తల్లిదండ్రుల బాధ్యత, ఘర్షణ కేసులో ఎదురయ్యే సమస్యల గురించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ వివరించారు. మండల రీసోర్స్ పర్సన్‌లుగా షకీల, చంద్రకళను ఎంపిక చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, సీఐ రాఘవన్, ఏపీఎం రామేశ్వర్‌రెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది శారద, హేమావతి, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

చిలమత్తూరు, అక్టోబరు 5: మద్యానికి బానిసై తరుచూ ఇంట్లో గొడవపడుతూ మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మున్నీర్ అహమ్మద్ శనివారం తెలిపారు. పలగలపల్లికి చెందిన రియాజ్ బాషా (48) కూలి పనులు చేసుకుంటూ జీవనం చేసుకుంటూనే, చాలా కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరుచూ భార్య నూర్‌జహాన్‌తో గొడవపడుతూ ఉండేవాడు. వారం రోజుల క్రితం మరోసారి గొడవపడ్డారు. దీంతో రియాజ్ బాషా మనస్తాపానికి గురై భార్యకు దూరంగా ఉండేందుకు పక్కనే ఉన్న మరో ఇంట్లో మూడు రోజులుగా ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడిన అతను అతిగా సేవించి ఉన్న ఇంట్లో పైకప్పుకు పంచెతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ ఇంటి పరిసరాలకు ఎవరూ వెళ్లకపోవడంతో గుర్తించలేకపోయారు. దుర్వాసన రావడంతో అతడి భార్య చూసి చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెరువులకు గండ్లు

మడకశిర రూరల్/సోమందేపల్లి, అక్టోబరు 5 : మండలంలోని సి.కోడిగేపల్లి చెరువు కర్ణాటక సరిహద్దులో ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు సి.కోడిగేపల్లి చెరువుకు చేరతాయి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వంకలు ద్వారా చెరువుకు నీరు చేరింది. చెరువు పక్కనే హంద్రీనీవా కాలువ వద్ద భారీగా గండి పడడంతో ఆ నీరు చెరువులోకి రాకుండా వృథాగా పోతోంది. సంబంధింత అధికారులు చర్యలు తీసుకుని చెరువు వద్ద పడిన గండిని పూడ్చాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని నడింపల్లి చెరువుకు గండిపడిన విషయాన్ని శనివారం గ్రామస్థులు గుర్తించారు. సమాచారాన్ని అధికారులకు చేరవేసి గండిని పూడ్చేందుకు చెరువు వద్దకు తరలి వెళ్లారు. అక్కడున్న ఇసుక బస్తాలతో పూడ్చివేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గండిని గుర్తించకపోయి ఉంటే కట్టతెగి చెరువు నీరు గ్రామంలోకి వచ్చేదని, పంట పొలాలను ముంచెత్తేదని పేర్కొన్నారు.


మడకశిర వద్ద చెరువుకు గండి, వృథాగా పోతున్న నీరు, సోమందేపల్లి వద్ద చెరువుకు గండిపడిన దృశ్యం

త్వరలో పెనుకొండలో గార్మెంట్స్ పరిశ్రమ


మంత్రిని సన్మానిస్తున్న గార్మెంట్స్ పరిశ్రమల నిర్వాహకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 5 : నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు ఇండియన్ డిజైన్ ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం ఆమె ఇంట్లో గార్మెంట్స్ పరిశ్రమ నిర్వాహకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా గార్మెంట్స్ నిర్వాహకులు మంత్రితో మాట్లాడారు. అనువైన ప్రాంతంలో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుచేసి ఉపాధి కల్పిస్తామన్నారు.

టెండర్ ప్రక్రియలో జాగ్రత్తలు పాటించండి

హిందూపురం, అక్టోబరు 5: మద్యం దుకాణాలకు టెండర్లు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అనంతపురం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీరామ్ అన్నారు. శనివారం హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం షాపుల టెండర్లపై ఆరాతీశారు. ఈనెల 9 వరకు టెండర్ల ప్రక్రియ ఉంటుందని, టెండర్ వేసేందుకు వచ్చే వారికి బ్యాంక్ అధికారులు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఎస్‌ఐలు పృథ్విరాజ్, ఫారూక్, పాల్గొన్నారు.

కల్తీకల్లుపై చర్యలు తీసుకోండి

హిందూపురం అర్బన్, అక్టోబరు 5: ఈత చెట్లే లేని మన ప్రాంతంలో ఈతకల్లు ఎలా తయారవుతుందని దళిత సంఘాలు, ఎంఎస్‌ఎఫ్ నాయకులు ప్రశ్నించారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కల్లు అమ్మడం తప్పు కాదని, కానీ మత్తుపదార్థాలను కలిపిన కల్లును అమ్మివేల కుంటుంబాలను దిక్కులేని వారిగా మిగులుస్తున్నారని తెలిపారు. ఈత చెట్లు లేని ఈ ప్రాంతంలో వాహనాల్లో కల్లు తీసుకొచ్చి అమ్ముతున్నారంటే.. ఎలా తయారు చేస్తున్నారో అధికారులు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నారని అన్నారు. లైసెన్సు లేని దుకాణాలపై ఎందుకు దాడులు చేయలేదని ప్రశ్నించారు. పరిగి మండలంలోనే 56 కల్లు అంగళ్లు ఉన్నాయన్నారు. కొడిగేపల్లి, పరిగిలో రెండు డిపోలు ఉన్నాయన్నారు. అక్కడే మందు కల్లు తయారవుతోందని ఆరోపించారు. ఈత వనాలే లేని హిందూపురంలో కల్లు ఎక్కడ నుంచి వస్తుందని నిలదీశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, నారాయణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌తో ఆక్రమణదారుల వాగ్వాదం

గోరంట్ల, అక్టోబరు 5: మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకున్నవారు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. పాలసముద్రం సర్వేనెంబర్ 127-3లోని ప్రభుత్వ స్థలంలో కొన్ని నెలల క్రితం ఆక్రమించుకుని 20 మంది భవన నిర్మాణాలు చేపట్టి, వాటి హక్కుల కోసం కొంతకాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ మారుతి అదే మార్గంలో వెళుతూ.. ఆక్రమణ స్థలాన్ని శనివారం పరిశీలించినట్లు చెప్పారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒకే స్థలంలో నిర్మాణం కోసం గొడవ పడుతున్నారన్నారు. దీంతో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 20 ఇళ్లవారు ఖాళీచేయాలని ఆదేశించారు. దీంతో సీపీఎం నాయకుడు పెద్దన్న ఆధ్వర్యంలో ఆక్రమణదారులు గోరంట్ల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌తో వాగ్వాదం చేశారు. సీఐ శేఖర్ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అక్కడి నుంచి పంపిచేశారు. ఇళ్లు లేనివారుంటే దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ స్థలాన్ని చూసి పట్టాలిస్తామని, దౌర్జన్యంగా ఆక్రమించుకోవడం సరికాదని తహసీల్దార్ తెలిపారు.

భూములు కోల్పోయాం.. పరిహారం ఇప్పించండి

గోరంట్ల, అక్టోబరు 5: మండలంలోని గౌనివారిపల్లి వద్ద ముద్దనూరు-హిందూపురం హైవే రోడ్డు విస్తరణ విషయంలో అర్హులైన తమకు పరిహారం అందేలా చూడాలని తహసీల్దార్ మారుతికి శనివారం రైతులు విజ్ఞప్తి చేశారు. గౌనివారిపల్లిలో 1971లో ఆరుగురు దళితులైన పేదలకు ప్రభుత్వం సాగు భూమి పట్టాలిచ్చింది. వీరందరూ పట్టా ఒకచోట ఉండగా సాగు మరోచోట చేస్తున్నారు. విషయం ఆలస్యంగా తెలియడంతో 2002 పాత పట్టాలు రద్దు చేస్తూ సాగుమేరకు కొత్త పట్టాలు ఇవ్వాలని అప్పటి కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. కానీ అధికారులు పట్టాలు ఇవ్వలేదు. ప్రస్తుతం హైవే రోడ్డు కోసం స్థలం సేకరించడంతో పట్టాలు లేని కారణంగా సాగులో ఉన్నవారికి అన్యాయం జరుగుతోందన్నారు. మాజీ సర్పంచ్ తిరుపాల్ ఆధ్వర్యంలో బాధిత రైతులు అక్కులప్ప, కదిరప్ప, గంగులప్ప, క్రిష్టప్ప, నరసమ్మ, లక్ష్మీదేవి, నరసింహులు, గంగప్ప, లక్ష్మణ తదితరులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు.

బాల్యమిత్రులకు సాయం

గోరంట్ల, అక్టోబరు 5: పట్టణానికి చెందిన అబ్దుల్లా, ఇర్షాద్ అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా బాల్యమిత్రులు శనివారం ఆర్థిక సాయం చేశారు. గోరంట్లలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. తాము చదివిన పాఠశాల వద్ద అనారోగ్యంతో ఉన్న మిత్రులు అబ్దుల్లాకు రూ.1.35లక్షలు, ఇర్షాద్‌కు రూ.51వేలు నగదు మొత్తాన్ని అందించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ, అక్టోబరు 5 : మండలంలోని కొంకల్లు గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి ఆకుపూజ, అభిషేకం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.